అష్ట కష్టాలు

ఎన్నడూ ఏ కష్టాలు ఎరుగని శివరామశాస్త్రిగారికి దేశంగాని దేశంలో అష్టకష్టాలూ సంప్రాప్తమయినాయి. అసలే ధనికుడు - లక్షరూపాయల ఆస్తికి దత్తుపోయినాడు. ఆపైన కాటకమప్పుడు బాకీలవాళ్ళంతా చాలా ఆస్తి చచ్చుధరలకు అంటగట్టారు. దాంతో శాస్త్రి బాగా ధనికుడైనాడు.

డబ్బున్నచోట నలుగురు చేరడం సహజం. శాస్త్రిని పెంచుకున్న పెద్దమనిషికి పరలోకప్రాప్తి కలిగిన మీదట అమాయకుడైన శాస్త్రి చుట్టూ చాలామంది చేరారు. వాళ్ళందరికీ ఒకే ఆలోచన-శాస్త్రిని మరికాస్త ధనికుణ్ణి చేద్దామని. ఈ సదుద్దేశంతో డబ్బు సంపాదించేందుకు చాలా ఉపాయాలు చెప్పారు. అయితే, వైద్యులల్లేనే, ఈ శ్రేయఃకాములు ఒకరు చెప్పిన ఉపాయం ఒకరు చెప్పకపోగా, ఒకరు చెప్పిన ఉపాయాన్ని మరొకరు కొట్టెయ్యటంకూడా జరిగింది. శాస్త్రి వస్తుతహా అమాయకుడు కనక, అందరు చెప్పినదీ వినకపోయినా కొందరు చెప్పిన సలహాలన్నా విని, ఇంత కలవాడు కనక, నాలుగు వ్యాపారాల్లోనూ నాలుగు డబ్బులు పెట్టాడు. పదివేలతో అవుతుందనుకున్న సినిమాహాలు పాతికవేలు దాటింది. 20వేలు ధారపోసి రెండు బస్సులు కొన్నాడు. 30 వేలుపెట్టి మందులషాపు పెట్టాడు. మళ్ళా ఇంకొకళ్ళెందుకని, తనకు ఆయా సలహాలిచ్చిన శ్రేయఃకాములనే వాటి వాటిల్లో పెట్టేసి పూర్తిగా స్వతంత్రమిచ్చేశాడు.

శాస్త్రిచేత తమకు నచ్చిన వ్యాపారాలు చేయించలేకపోయిన శ్రేయఃకాములు, శాస్త్రిసొమ్ము స్నేహితులు తెగ తినేస్తున్నారో అని గోల పెట్టారు. బస్సులమీద బోలెడంత లాభాలు వస్తున్నా శాస్త్రికి కానీ దక్కనివ్వకుండా మధ్యవాడు తినేశాట్ట! మందులషాపు మీద అంతులేని లాభం వస్తుంటే ఆ లాభాన్ని గల్లాపెట్టె దగ్గిరవాడు తినేశాట్ట! సినిమాహాలు నడిపినవాడు సాక్షాత్తూ నష్టమే చూపించాట్ట! అందరూ తలా ఒక విధంగా అన్నారు - శాస్త్రితోనే. కానీ అమాయకుడు కావటంచేత వినిపించుకోలేదు.

'ఆఁ వాళ్ళట్టా చేసేవాళ్ళు కారు. నామేలు కోరినవాళ్ళు' అన్నాడు.

కానీ ఎంత అమాయకుడైతే మాత్రం ఎన్నాళ్ళు నష్టం భరిస్తాడూ? బస్సుల మేనేజరునూ, మందులషాపు మేనేజరునూ, సినిమాహాలు మేనేజరునూకూడా తీసేశాడు? ఊరికే తీసేశాడా? వాళ్ళను చూసి జాలిపడ్డాడు. 'పాపం, మీరేంచేస్తారు? నాకు కలిసి వచ్చే గీతలేదు. నన్ను నమ్ముకుని మీరుకూడా ఇంతకాలం నష్టపడ్డారు.

అంటూ తలా ఒకవెయ్యీ రెండువేలూ వాళ్ళకి దక్షిణకూడా ఇచ్చుకుని మరీపంపాడు.

వాళ్ళు పోమన్నారు. ఎంత నష్టం వచ్చినా ఉంటామన్నారు. శాస్త్రికి లాభాలు చూపిస్తేగాని తమ జన్మలు తరించవన్నారు. కాని శాస్త్రి వినిపించుకోలేదు. తన అంతరాత్మ ఒప్పటం లేదన్నాడు. మిగిలిన చిల్లర వ్యాపారాల మాట అటుంచి, ఈ మూడు వ్యాపారాల మీదా శాస్త్రి యుద్ధంపూర్తి అయేలోగా మూడులక్షలు చేశాడు.

యుద్ధం అయిపోయే సమయానికి శాస్త్రిలో పూర్వంలేని గొప్పగుణాలు చాలా తలయెత్తాయి. మొదటి సంగతి శాస్త్రి చాలా దైవభక్తి కలవాడూ, మతభక్తికలవాడూ అయినాడు.

శాస్త్రి తీర్థయాత్రలకు బయల్దేరటానికి ఇదే పెద్దకారణం. ఈ తీర్థయాత్రలోనే శాస్త్రి దగ్గిరవున్న డబ్బూ, సామానూ, టిక్కెట్లూ అన్నీ పోయాయి.

2

శాస్త్రి తీర్థయాత్రకు తన భార్యనూ చంటిపిల్లనూ మాత్రమే తీసుకుని బయలుదేరాడు. మిగిలిన పిల్లల్నిగాని కనీసం ఒక నౌకర్నుగాని, చుట్టాన్నిగాని వెంటపెట్టుకుపోలేదు. అసలే రైలు ప్రయాణాలు బాధాకరంగా ఉన్నాయి. 'తేలికగాప్రయాణించండి' అని రైల్వేశాఖవారు ఒకవంక బొమ్మలతోసహా హెచ్చరిస్తూఉండిన రోజులు. రైళ్ళ అన్ని తరగతులలోనూ జనసమ్మర్ధం చాల హెచ్చుగాఉంది. అప్పటికీ శాస్త్రి తమ వెంట తీసుకుపోయ్యే సామాను సాధ్యమైనంత తక్కువగానే ఉండేటట్టు చూశాడు. రెండు పక్కచుట్టలూ, ఒక ట్రంకుపెట్టే, ఒక మరచెంబు, ఒకబుట్టా, రెండు చేతిసంచులూ, ఇంతే వీళ్ళు వెంటపెట్టుకు బయల్దేరారు. ప్రయాణం ఇంటరుక్లాసులో.

శాస్త్రీ భార్యా మొదటగా సింహాచలంలో దిగారు. అక్కణ్ణుంచి పూరీ జగన్నాధం వెళ్ళారు. తరవాత కలకత్తా వెళ్ళి, అక్కణ్ణుంచి కాశీ బయల్దేరారు.

సింహాచలం దాటినప్పటి నుంచే వాళ్ళపని అయోమయంగా ఉన్నది. 'దేశంగాని దేశం' అని శాస్త్రి భార్య ఎన్ని వందలసార్లన్నదో తెలీదు. దేశంగాని దేశమే ఏమిటి? భాషగాని భాషా,మనుషులుగాని మనుషులూనూ, వింతవింత బట్టలు కట్టుకుని, ఏవేవో భాషలు మాట్లాడే కూలీలూ,రైలు అధికార్లూ,ఇతరులు తన మొగుడితో ఏమేమిటో మాట్లాడినప్పుడల్లా ఆ ఇల్లాలి ప్రాణం కొట్టుకు పొయ్యేది. వాళ్ళు ఎక్కడ టోపీవేసి లాజేస్తారో అని. రహస్యమేమంటే ప్రపంచమంతా అనుకున్నట్లే, ఆవిడ కూడా తన భర్త వొట్టి అమాయకుడని నమ్మేది.

కలకత్తాకు కాశీకి మధ్య చోరీజరిగింది. ఎట్లాగోకష్టపడి శాస్త్రిభార్య పిల్లలను పక్కన పడుకోబెట్టుకొని కాస్త నడుం వాల్చిందిగాని శాస్త్రి రైల్లో తెల్లవార్లూ మేలుకునే కూర్చున్నాడు. నిద్రసుఖమెరుగదని ఊరికే అన్నారా? మధ్య స్టేషనులో టిక్కెట్టు కలెక్టరువచ్చి శాస్త్రినిలేపి టిక్కెట్టు అడిగే సమయానికి ఆయన పక్కమనిషి మీదికి ఒరిగి నిద్రపోతున్నాడు.

శాస్త్రి పెట్టె కోసం తడువుకున్నాడు. పెట్టె కనబడలేదు. శాస్త్రి డబ్బూ, టిక్కెట్లూ, అందులోనే ఉన్నాయి. ట్రంకుపెట్టెతో బాటూ రెండు ప్రక్కచుటల్లో ఒకటీ, మరచెంబూ, బుట్టా, రెండు చేతిసంచులూ కూడా పోయాయి.

శాస్త్రి ఎవరి నడుగుతాడు? దాదాపు పెట్టెలో వాళ్ళంతా నిద్రపోతున్నారు. తన సామానంతా పోయిందని శాస్త్రి టిక్కెట్టు కలెక్టరుకు విన్నవించుకున్నాడు.

టిక్కెట్టు కలెక్టరు ఏస్టేషన్లో పోయిందని అడిగాడు. ఇదిచాలా దయారహితమైన ప్రశ్న. కానీ శాస్త్రి తనకు తెలీదని ఒప్పుకోక తప్పిందికాదు. టిక్కెట్టుకలెక్టరు ఇంకా చాలాప్రశ్నలు వేశాడు. ఎక్కణ్ణుంచి వస్తున్నారు? ఎక్కడికి పోతున్నారు ? ఏ క్లాసు టిక్కెట్లు కొన్నారు? టిక్కెట్ల నంబర్లేమిటి? ఎంత ఖరీదైనాయి ? మీ పేరేమిటి? అసలు ఏ దేశం?

ఈ ప్రశ్నలన్నింటికీ శాస్త్రి తెలిసినంతవరకు సమాధానాలు చెప్పాడు.

సామాను పోవటం కాదుగాని శాస్త్రి చాలా చిక్కుల్లో పడ్డాడు. మెల్లిగా రైలు పెట్టెలో వాళ్ళంతా లేచారు. ఒక్కొక్కరే శాస్త్రిని అనేక రకాల ప్రశ్నలు వెయ్యసాగారు. అందరూ ఇంగ్లీషుభాష మాట్లాడలేదు. కొందరు హిందీ, ఒకరిద్దరు మార్వాడీ కూడా మాట్లాడారు.

పక్కస్టేషనులో గార్డు వచ్చాడు. ఏవో రాసుకున్నాడు.

'బనారస్‌లో ఎక్కడ దిగుతారు? సిటీలోనా, కాంటన్మెంటు లోనా?'

శాస్త్రికి సరిగా జ్ఞాపకం లేదు. ఎక్కడో దిగాలని చెప్పాడు. రెండూ విన్న పేర్లే. టిక్కెట్టు మీద ఏమున్నదో కూడా సరిగా చూడలేదు. చిక్కేమిటంటే ఎవరో తెలుగాయన కనపడి హౌరాస్టేషన్‌లో ఆ టిక్కెట్లు తెచ్చిపెట్టాడు. ఆయన చిల్లర సరిగా ఇచ్చిందీ, లేందీ చూసుకోటానికైనా వీల్లేనంత హడావిడి అయిపోయింది.

శాస్త్రి ఏఉద్దేశంతో వెళుతున్నదీ తెలుసుకుని గార్డు బెనారస్ కాంటోన్మెంటులో దిగమన్నాడు. స్టేషను మాస్టరుకు టెలిగ్రాం ఇప్పిస్తానన్నాడు.

3

తెల్లవారింది. శాస్త్రి పెళ్ళాం శోకాలు పెట్టింది. ఏవేళ బయలుదేరా మోనన్నది. ఎవరి మొహం చూశామో నన్నది.

'పోనీలే. పోయిందంతా కలిపితే రెండు వందలు చెయ్యదూ' అన్నాడు శాస్త్రి. ఇంటిదగ్గర బయల్దేరింది లగాయతు ఆయన ప్రతిఊరికీ చెల్లిగ్రాంమనియార్డరుతెప్పించు కుంటున్నాడు గాని ప్రయాణ ఖర్చంతా దగ్గిర ఉంచుకోనడంలేదు.

కాని ఇతర కష్టాల గురించి ఆయన ఆలోచించ లేదు. మొట్టమొదట మొహం కడుక్కోవటం దగ్గరే కష్టాలు ఆరంభమయాయి. పళ్ళపొడి పోయిన సంచీలో ఉండి పోయింది.

బండి కాశీ చేరటానికి ఏ పదో అవుతుంది. బేడాపెట్టి రెండు పూరీలూ కూరా తిందామంటే జేబులో బేడాలేదు.

చంటిపిల్లకు పోతపాలు. అది లేవగానే పాలడుగుతుంది.

ఇవన్నీ ఒక్కటొక్కటే శాస్త్రికి జ్ఞాపకం రాసాగాయి.

'తీరా కాశీ స్టేషను చేరగానే కూలివాళ్ళచేత సామాను దింపించాల్సి వస్తుంది. వాళ్ళకేమివ్వను? నా డబ్బు పోయిందంటే వాళ్ళూరుకుంటారా?' అనుకున్నాడు శాస్త్రి. ఈ కష్టంగురించి ఆలోచిస్తూండగానే తనకు దించే సామాను ఒక పరుపు చుట్టేనని జ్ఞాపకంవచ్చి గుండె గుభేలు మన్నది.

'ఆఁ ఏముంది? కాశీలో దిగిన మరుక్షణం అర్జెంటు వైరిచ్చి సొమ్ము తెప్పి స్తాను' అనుకుని మనసును స్వస్థ పరచుకున్నాడు శాస్త్రి.

ఎందుచేతనో రైలు ఒక చిన్న స్టేషనులోఆగి మరికదలలేదు. అది మామూలుగా ఈరైలుఆగే స్టేషను కాదు. ఏమయిందంటే ఏమయిందని అందరూ ఒకరినొకరు చాలా సేపు అడుగుకున్నాక,అవతలి స్టేషనులో లైనుకడ్డంగా గూడ్సుపెట్టెలు రెండు అంతకు మునుపే పడిపోయినట్టు తెలిసింది.

గంట గడిచింది. రెండు గంటలు గడిచాయి. చంటిపిల్ల లేచింది. పాలకేడుపు లంకించు కుంది. ఎందుకు పిల్ల ఏడుస్తుందని అందరూ అడిగారు. పాలకేడుస్తున్న దంటే, 'అయ్యో, పాపం,' అని ఊరు కున్నారు.

శాస్త్రి పెళ్ళాం ఆరాటం చెప్పడానికి వీలులేదు. ఇంతసంపదాఉండి తన కూతురికి గుక్కెడుపాలు కరువై,దేశంగాని దేశంలో ఆకలికి రోదించేగతి సంప్రాప్తమవుతుందని ఆ యిల్లాలు కలలోకూడా అనుకోలేదు. మానవజాతి పుట్టిన తరువాత చంటిపిల్లకు పాలులేక ఏడవటమనేది మొట్టమొదటిసారి తన బిడ్డకే సంప్రాప్తమయిందను కున్నది. చన్ను కుడిపింది. కాని తన దగ్గర పాలులేవు. పిల్ల ఒక్క క్షణం నోరు మూసిందేగాని మరింత గుక్కపట్టి మళ్ళా ఏడుపు లంకించుకుంది.

'అట్లా చూస్తూ కూచుంటా రేమండీ?' పోయి ఎవరన్నా చుక్క పాలిస్తారేమో అడగండి!' అన్నది శాస్త్రి భార్య.

శాస్త్రి ఎవరి నడుగుతాడు? తన స్నేహితుడయిన గార్డు నడిగాడు. గార్డుమాత్రం ఏం చెయ్యగలడు? స్టేషను మాస్టర్నడిగాడు. స్టేషను మాస్టరు ఇంటికి కబురుచేసి పాలు తెప్పిస్తానన్నాడు.

'పాలు తెప్పించి ఏంలాభం? పిల్ల కొమ్ముచెంబూ. రబ్బరు పీకా లేందే తాగ లేదు' అన్నది శాస్త్రిభార్య. అవి రెండూ ఇంకో సంచీతోబాటు పోయాయి.

'ఏదో ఒకటి చెయ్యాలి. ఇంటో అమరినట్టు అన్నీ అమరుతాయా' అన్నాడు శాస్త్రి.

స్టేషను మాస్టరు పాలు తెప్పించాడు. మట్టిపిడతలో పాలు వచ్చాయి. పాలి నిండా ఏదో సన్నని బొచ్చులాటిది తేలుతున్నది.

మట్టిపిడత నోటి కందిస్తే పిల్ల తాగలేక కొరబోయి ఏడిచింది.

ఈ సమయంలో ఒక నల్లటి మనిషి తోసుకుని ముందుకువచ్చి హిందీలో 'ఇట్లాతే బిడను' అన్నది. శాస్త్రిభార్య అర్థంకాక చూస్తూంటే ఆ మనిషి శాస్త్రిభార్య దగ్గర్నుంచి బిడ్డను లాక్కుని ఒక పక్కగా తీసుకుపోయి పాలివ్వసాగింది.

శాస్త్రి కూతురు కాళ్ళూ చేతులూ ఆడిస్తూ ఆకలిమీద రెండు పక్కలా పాలు పీల్చేసింది.

ఇతరులతో పని ఉన్నప్పుడు ఎంత అలగా మనుష్యులనైనా ఆకాశాని కెత్తటం అలవాటయిన శాస్త్రిభార్య దాన్ని తెలుగులో తెగ ఉబ్బేయ్యసాగింది. కానీ దానికి ఆవిడమాట ఒక్కటీ అర్థం కాలేదు.

'ఆ మనిషికొక అణో, బేడో ఇవ్వండి సంతోషిస్తుంది. చాలా బీదమనిషి.' అన్నాడు స్టేషను మాస్టరు, ఇంగ్లీషు బలవంతాన మాట్లాడుతూ.

'నా దగ్గిర కాణీ లేదు. నా సామానంతా ఎత్తుకు పోయినారు. టిక్కెట్లుకూడా పోయాయి' అని శాస్త్రి బీదఅరుపులు అరిచాడు.

స్టేషను మాస్టరే తనజేబులోనుంచి ఒక అణాతీసి పాలిచ్చిన మనిషి కిచ్చాడు.

4

శాస్త్రి కాశీచేరే సమయానికి రెండయింది. తనకూ పెళ్ళానికీ పిల్లకు ఆకళ్ళు దహించుకు పోతున్నాయి. పిల్లపోరు పెట్టి ఏడుస్తున్నది. ఎప్పుడో తొమ్మిదిన్నరకు తాగిన పాలు. అయితేనేం? తెలుగు మాట్లాడే పండా ఒకడు రైలులో తగిలాడు. తన వెంటవస్తే అన్ని ఏర్పాట్లూ చేయిస్తానన్నాడు. చేశాడు కూడానూ. ఆరోజు సాయంకాలం మూడింటికి అర్జంటు టెలిగ్రామిస్తే మర్నాడు పదింటికల్లా రెండువందల రూపాయలు వచ్చేశాయి. కష్టాలు ఎల్లకాలమూ ఉంటాయా-అవతల ఇంత ఉన్నవాళ్ళకి?

—ముద్రణ : తెలుగు స్వతంత్ర ; 4, ఆగష్టు, 1950.